

ప్రముఖ రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడుకి బుధవారం వై ఎస్ ఆర్ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించిన రాష్ట్ర ప్రభుత్వం నామినికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం, పది లక్షలు నగదు ప్రదానం చేశారు

'సహకారానికి' మొండిచేయి

2018 చిత్తూరు జిల్లాలో జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర

'విజయ'ను అమూల్‌కు అప్పగింత
చక్కెర ఫ్యాక్టరీ ప్రారంభ ఊసేలేదు
సచివాలయాలకు నిధుల 'మూట' ఏది..?
నేడు సామాజిక బస్సు యాత్ర

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

'మాట తప్పను.. మడమ తిప్పను' అని చెప్పుకునే సిఎం జగన్మోహన్‌రెడ్డి జిల్లాకేంద్రమైన చిత్తూరుకు ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారు. మూతబడిన విజయ డెయిరీని అమూల్‌కు 99 ఏళ్లపాటు లీజ్‌కు ఇస్తూ కట్టబెట్టేశారు. సహకార చక్కెర ఫ్యాక్టరీ పున్ణప్రారంభించే ఊసే లేకుండా పోయింది. అధికారంలోకి రాక ముందు సరే.. అధికారంలోకి వచ్చాక ఏడాది క్రితం జిల్లాకేంద్రానికి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి 50 లక్షల చొప్పున నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఒక్క రూపాయి ఇస్తే ఒట్టు.. ప్రధాన హామీలన్నీ గాలికొదిలేసి సామాజిక బస్సు యాత్ర పేరిట గురువారం జనంలోకి రావడం గమనార్హం.

సార్వత్రిక ఎన్నికలకు ముందు 2018, జనవరి 7న చంద్రగిరి నియోజకవర్గం దామలచెరువులో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతపురం జిల్లా నుండి ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లిలోకి ప్రవేశించిన జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర తంబళ్లపల్లి మీదుగా సదుంలో బహిరంగసభలో పాల్గొని, దామలచెరువులో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు భారీగా హామీలు ఇచ్చారు. చంద్రబాబు హెరిటేజ్ ఫ్యాక్టరీ వల్ల మూతబడిన విజయ డెయిరీని అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో తెరిపిస్తామని, పాడి రైతులకు లీర్ పాలపై రూ.4 బోనస్ అందిస్తామని వెల్లడించారు. అయితే సహకార విజయ డెయిరీని 99 ఏళ్ల పాటు అమూల్ సంస్థకు అప్పగించారు. చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని భరోసా ఇచ్చారు. చెరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్న హామీ హామీగానే మిగిలిపోయింది.

రెండు సార్లు చిత్తూరులో పర్యటించిన సిఎం

ముఖ్యమంత్రిగా చిత్తూరు నగరానికి జగన్‌మోహన్‌రెడ్డి రెండు సార్లు చిత్తూరులో పర్యటించి భారీ బహిరంగ సభల్లో ప్రసగించారు. మొదటిసారి అమ్మఒడి పథకాన్ని చిత్తూరు నగరం నుండీ ప్రారంభించారు. రెండో సారి విజయా సహకార డెయిరీని అమూల్ సంస్థకు అప్పగిస్తూ పోలీస్ క్రీడామైదనంలో నిర్వహించిన బహిరంగ సభలో చిత్తూరు అభివృద్ధికోసం చిత్తూరు మున్సిపల్ నగర పాలక సంస్థ పరిధిలోని ఒక్కో డివిజన్‌కు అభివృద్ధి పనుల కోసం 50 సచివాలయాకు ఒక్కో సచివాలయానికి రూ. 50 లక్షలు మంజురు చేస్తూ హామీ ఇచ్చి ఏడాదికి పైగా గడుస్తున్నా వైకాపాలోని గ్రూపు రాజకీయాలతో సిఎం మంజూరు చేసిన నిధులు ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొంది. నగర పాలక సంస్థలో గుర్తించిన మురికివాడలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సాక్షిగా అధికార పార్టీ కౌన్సిలర్లు బాహాబాహిగా తలపడ్డారు... విజయ సహకార డెయిరీ కార్మికులు బకాయి వేతనాల కోసం 46 రోజులుగా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి.

నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర

మరో మారు అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గురువారం చిత్తూరు నగరంలో సామాజిక సాధికార బస్సు యాత్ర పేరుతో ప్రజల ముందుకు వస్తోంది. మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలతో పాటు ఎంపిలు, ఎంఎల్ఏలు వైకాపా నాయకులు ఈ బస్సు యాత్రలో పాల్గొంటున్నారు. నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత ముఖ్య మంత్రి నాటి ప్రతిపక్ష నేత జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన చిత్తూరు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. చిత్తూరుకు యూనివర్శిటి మంజురు చేయడంతో పాటు నగర పాలక సంస్థ పరిధిలోని మురికివాడల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని చిత్తూరు నగర వాసులు కోరుతున్నారు. సామాజిక సాధిక బస్సు యాత్ర పేరుతో జనంలోకి వస్తున్న అధికార పార్టీ నేతలు నేటి దళిత వాడల్లో కొనసాగుతున్న కుల వివక్షను రూపుమాపడం, స్మశాన వాటికలు ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై చోటు చేసుకుంటున్న హత్యలు, అత్యాచారాలు అరికట్టేలా బస్సు యాత్రలో ప్రసంగించాలని కోరుతున్నారు.



కటింగ్ నిరాకరిస్తున్న బార్బర్ షాప్ యజమానులు

'పెద్దల' మాటకు కట్టుబడి...
ఎస్సీ ఎస్టీలకు కటింగ్ చేయం
బార్బర్ షాపు యజమానులు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి

మండల పరిధిలోని నెల్లిపట్ల గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు కటింగ్ చేయబోమని బార్బర్ షాపు ఓనర్లు తెగేసి చెబుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో దాదాపు వెయ్యిమందికి పైగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి. వీరు కటింగ్ చేయించుకోవాలంటే బైరెడ్డిపల్లి మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. నెల్లిపట్ల గ్రామంలో చేసేది లేదని ఏమాత్రం జంకూ లేకుండా షాపు యజమానులు తెగేసి చెప్పేస్తున్నారు. ఎస్సీలు ఈ విషయమై నిలదీయగా 'మీరు ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండి.. గ్రామ పెద్దలు చెప్పిన ఆదేశాల మేరకు మీకు మేం కటింగ్‌చేసేది లేదు' అని నిరాకరిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఇంకా తమ పట్ల వివక్ష చూడాన్ని ఎస్సీలు ప్రశ్నిస్తున్నారు. గ్రామపెద్దలు ఈ విధమైన నిర్ణయాలు చేసి వివక్షకు తావివ్వడాన్ని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దళితులకు కటింగ్ చేయరాదని గ్రామ పెద్దలు నిర్ణయిస్తే ఇంకా అంబేద్కర్ రాజ్యాంగానికి విలువేముందని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామపెద్దలపై చర్యలు తీసుకుని, గ్రామంలోనే తమకూ కటింగ్ చేసేలా చూడాలని దళితులు కోరుతున్నారు.

పొట్టిశ్రీరాములు కృషి మరువలేనిది : కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్ భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడటానికి అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి మరువలేనిదని కలెక్టర్ ఎస్.షన్మోమన్ అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా సచివాలయంలో కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రీవెన్స్ హాలులో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రిజర్వ్ సాయుధదళం నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాన్ని మరువలేమని, 56 రోజులు ఆమరణదీక్ష చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఒ ఎన్.రాజశేఖర్, జడ్‌పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, ఎఎస్‌పి సుధాకర్, డిడి సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

యాదమరి మండలంలో కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాల, వరిగపల్లె, పెరుమాళ్లపల్లి, వరదరాజులపల్లి, నడిమూరు పాఠశాలల్లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి త్యాగనిరతిని విద్యార్థులకు వివరించారు. హెచ్ఎం లలిత, టీచర్స్ కనకాచారి, షహనాజ్, హిమబిందు, అఖిలాండేశ్వరి, కాంచన, శివప్రసాద్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. చిత్తూరు పోలీసు కార్యాలయంలో ఎస్‌పి రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆర్ అండ్ బి అతిథిగృహంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి భరత్, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద పాల్గొన్నారు

నగరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ లీలామాధవి ఆధ్వర్యంలో, కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ జింక లక్ష్మీనారాయణ హాజరయ్యారు. గంగవరం ఎంఇఒ, ఎంపిడిఒ కార్యాలయాల్లో జరిగింది. సోమలలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో, ఎంపిడిఒ కార్యాలయాల్లో, సోమల, కందూరు సచివాలయాల్లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరనాయుడు, ఎంపిడిఒ నాగరాజు, సర్పంచి బాషా మసూద్ పాల్గొన్నారు. కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలని జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ పొన్న యుగంధర్ డిమాండ్ చేశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండల కేంద్రంలో జనసేన నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. కార్వేటినగరం మండల అధ్యక్షులు శోభన్‌బాబు,ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ఎస్‌పి

'దీపావళి'కి నిబంధనలు తప్పనిసరి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

దీపావళి పండుగ అందరి కళ్ళల్లో ఆనందం నింపేదిగా వుండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదాలు జరగకుండా చూడాలని, నియమ నిబంధనల మేరకు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని చిత్తూరు ఆర్ డి ఒ చెన్నయ్య అన్నారు. చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు గురించి ఫైర్, పోలీస్, మార్కెట్ కమిటీ , సంబంధిత తహశీల్దార్లు దుకాణదారులతో ఆర్ డి ఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలని, పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారులు ఆ ప్రదేశాలను నిర్ణయిస్తారని తెలిపారు. తాత్కాలిక దుకాణాలు ఏడు రోజుల పాటు నిర్వహించుకోవచ్చన్నారు. ప్రతి దుకాణదారుడు లైసెన్స్ కోసం అప్లై చేసుకోవాలన్నారు. నిబంధనల మేరకు చలానాలు చెల్లించి, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి దుకాణం 10×10 సైజులో ఉండాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా రెండు బకెట్ల నీరు, రెండు బకెట్ల మట్టి ఉంచాలని సూచించారు. జిఎస్‌టి సర్టిఫికేట్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఫైర్ అధికారి కరుణాకర్, పోలీసు ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డ, మార్కెటింగ్ అధికారి ఇందుమతి పాల్గొన్నారు.

ఆక్రమణకు గురికాకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో చెరువులు, నగరపాలక సంస్థకు చెందిన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ డా. జె అరుణ నగర ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. గంగినేని చెరువు దక్షిణం వైపు ఉన్న స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. చెరువు స్థలం ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ప్రణాళిక విభాగం అధికారులు ఆదేశించారు. మిగిలిన శాఖలను సమన్వయం చేసుకొని చర్యలు చేపట్టాలన్నారు. దుర్గా నగర్ కాలనీ చెరువు, కట్ట మంచి చెరువు, బుడమాల చెరువులో ఆక్రమణలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. చెరువు స్థలంలో వేసిన వ్యర్థాలను తొలగించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎసీపీ రామకష్ణుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం పాల్గొన్నారు.

ఇచ్చిన 'మాట' ఏమాయే...!

అనుప్పల్లి రైతులు 68 నెలలుగా నిరీక్షణ

ప్రజాశక్తి - రామచంద్రాపురం

'మాటకు కట్టుబడి ఉండాలి' అదే పాలకునికి విలువ, మర్యాద. అలాకాకుండా హామీలిచ్చేసి 'మాట తప్పను... మడమ తిప్పను' అని డాంభికాలు పలుకుతూ, హామీలను నెరవేర్చకపోతే జనం కూడా ఎల్లకాలం మోసపోరు. ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు కోసం ఒక్కనెల రెండు నెలలు కాదు.. 68 నెలలుగా అనుప్పల్లి రైతులు నిరీక్షిస్తూనే ఉన్నారు..

ఉమ్మడి చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం అనుప్పల్లి పంచాయతీ నెమళ్లగుంటపల్లి గ్రామంలో ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా అప్పటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2018, జనవరి 10న రైతు సదస్సు నిర్వహించారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనూ, కాంగ్రెస్ హయాంలోనూ భూపంపిణీ కార్యక్రమం కింద అనుప్పల్లి రెవెన్యూ లెక్కదాఖలాలోని పేదలకు

దరఖాస్తు పట్టాలను మంజూరు చేశాయి. కానీ సర్వే నంబర్ 410 నుండి 493 వరకూ రెవెన్యూ అధికారులు ఇంప్లిమెంటేషన్ చేయడంలో నిర్లక్ష్యం చూపారు. అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేదనే ఉద్దేశ్యంతో రెవెన్యూ అధికారులు విచారణ జరిపి దరఖాస్తు పట్టాలను రద్దు చేశారు. అనుప్పల్లి పంచాయతీలో 200 మంది రైతులకు సంబంధించి 300 ఎకరాల డికెటి భూములను 2017, జులైలో అప్పటి కలెక్టర్ ప్రద్యుమ్న రద్దు చేశారు. ఈ విషయమై వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి, వైసిపి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి, స్థానిక ఎంఎల్ఎ చెవిరెడ్డి దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా రైతు సదస్సులో 'వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మీ భూములు మీకు ఇప్పిస్తా' అని హామీ ఇచ్చారు. అయితే అనుపల్లి పంచాయతీలో రద్దయిన డికెటి భూముల రైతులకు సంబంధించి మాత్రం మాట తప్పాడు. మడమ తిప్పాడు. అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగున్నరేళ్ల పాటు తాము నిరీక్షించామని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెబుతామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు నెలల్లో అయినా ఇచ్చిన హామీ గురించి ఆలోచిస్తారా? లేక విస్మరిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.

సంక్షేమ పథకాలు అందరికీ అందాలి

ప్రజాశక్తి -చిత్తూరు

ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించేందుకు అనేక ప్రాధాన్యత అంశాలను చేపట్టడం జరిగిందని, వాటి లక్ష్యాలను నిర్ణయించిన గడువు లోపల చేరాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లాలలో అమలు అవుతున్న వివిధ కార్యక్రమాల గురించి జడ్పీ సీఈవో, పంచాయతీరాజ్, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను చేపట్టడం జరిగిందని, నిర్ణయించిన గడువు మేరకు వీటిని పూర్తి చేయించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. క్షేత్రస్థాయిలో స్టేజీల వారీగా కన్వెర్షన్ పూర్తిచేసి నిర్ణయించిన గడువు లోపల భవనాలను అప్పగించాలని అన్నారు. ఉపాధి హామీ ద్వారా మరింతగా కూలీలకు వేతనం వచ్చేలా పనులు నిర్వహించాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనుల ద్వారా పనులు కల్పించే బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామాలలో పరిశుభ్రత పనులు నిర్వహించి ప్రజలకు వ్యాధులు రాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న పనులను వేగవంతం చేసి గ్రామాలలో ఇంటింటికి నీరు ఇచ్చే బాధ్యత వెంటనే పూర్తి చేయాలని అన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర రెడ్డి, పిడి డ్వామా గంగాభవాని, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాశిరాళ్ల పాఠశాలలో అవినీతి నిర్మూలన వారోత్సవాలు

ప్రజాశక్తి- యదమరి

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలన వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అవినీతి నిర్మూలన వారోత్సవాలు (అక్టోబర్ 30నుంచి నవంబర్5వరకు) కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్దులకు, క్విజ్ పోటిలు, డ్రాయింగ్ , వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎపి లలిత తెలిపారు. ముఖ్య అతిథులు గా అంజనేయులు, పూజిత విచ్చేసి బహుమతులను ప్రదానం చేశారు. చివరి రోజున ఐ.ఓ.సి.ఎల్ వారు, అధికారుల చేత ప్రశంసాపత్రాలను అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యయులు భాస్కర రెడ్డి, సుల్తాన్, కనకాచారి పాల్గొన్నారు.

మిత్ర ఎంటర్టైన్మెంట్ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

మిత్ర ఎంటర్టైన్మెంట్స్ లోగోను జీ తెలుగు ఛానల్ సీరియల్ హీరో హీరోయిన్ మహేష్ బాబు కాళిదాసు, సుహాసిని జయచంద్రన్ ఆవిష్కరించారు. స్థానిక బైరాగిపట్టెడలోని మిత్ర ఎంటర్టైన్మెంట్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ట్రెడిషనల్ మోడల్ షోలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతం లో ఉండే వారికి, అలానే పట్టణాలలో ఉండే పిల్లలకు, యువతీయువకులకు వారి టాలెంట్ ప్రదర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలియచేశారు. అలాగే మిత్రా ఎంటర్టైన్మెంట్స్ ప్రతి సంవత్సరం మిస్ అండ్ మిస్సెస్ ఆంధ్ర ఐడియల్ ఐకాన్ పేజెంట్ షో ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరందరికీ మోడలింగ్, సీరియల్స్, సినిమా రంగాలలో అవకాశాలు లభించే అవకాశం ఉన్నట్లు తెలియజేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమంలో సామాజిక స్పృహతో నిర్వహించ నున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిస్ ఇండియా ఐకానిక్ దివా 2023 విజేత భావన చిన్నతంబు, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ బయోటెక్నాలజీ హెచ్ ఓ డి జోష్నా, మిత్ర ఎంటర్టైన్మెంట్స్ చైర్మన్ సి గోపికష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఏ, ఎంబీఏ కోర్సులలో ఏది బెటర్ ..?

ఆర్‌సిఆర్ బిజినెస్ స్కూల్ కాలేజీ డైరెక్టర్ విశ్లేషణ

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న ఎంతోమంది విద్యార్థులు ఏ కోర్స్ వైపు ఉన్నత అవకాశాలు ఉన్నాయనే అంశంపై పూర్తిస్థాయి అవగాహన రాహిత్యంతో తికమక పడుతూ ఉంటారని ఆర్ సి ఆర్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ వి.రవికుమార్ చౌదరి వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొఫెషనల్ కోర్సులలో ఎంసీఏ, ఎంబీఏ కోర్సులలో ఏది బెటర్ అనే అంశంపై రవికుమార్ చౌదరి "ప్రజాశక్తి "తో మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఉన్నత ఆశయంతో డిగ్రీని పూర్తిచేసుకుని ఏ కోర్సులో చేరితే ఉన్నత అవకాశాలు ఉంటాయని సందిగ్ధంలో ఎక్కువమంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. డిగ్రీ పూర్తి అయిన తర్వాత ఐసెట్ ద్వారా ఎంబీఏ లేదా ఎంసీఏ లలో ప్రవేశం పొందచ్చని వెల్లడించారు. ఇప్పటికే చాలామంది ఎంబీఏ, ఎంసీఏ లలో ఏ కోర్సులో చేరాలో తెలియక తికమక పడుతూ ఊగిసలాడే ధోరణిలో ఉన్నారని అన్నారు. ఈ కోర్సులలో ఏ కోర్సులో చేరితే మంచి భవిష్యత్తు ఉంటుంది, ఎవరికి ఏ కోర్సు సరిపోతుంది, దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఐసెట్ 2 విడత కౌన్సిలింగ్ నోటిఫికేషన్ వెలువడుతున్న నేపథ్యంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల స్వరూపం అవకాశాలు భవిష్యత్తు తదితర అంశాలపై ఆయన "ప్రజాశక్తి "తో ప్రత్యేక కథనంలో వెల్లడించారు.

కోర్సుల ఎంపిక ఎలా ....?

మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్ (ఎంసీఏ) అనేవి ఉన్నత విద్యపరంగా విద్యార్థులకు అందుబాటులో ఉన్న రెండు ప్రముఖమైన ప్రొఫెషనల్ కోర్సులు. ఈ రెండు కోర్సులు కార్పొరేట్ రంగంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందించేవి. ఏది మంచి కోర్సు, ఎందుకు మంచిది, అనేది నిపుణులు కూడా స్పష్టంగా సమాధానం చెప్పలేని ప్రశ్న ఇది. ఎందుకంటే ఈ రెండు కోర్సులలో ఒకదానికొకటి విభిన్నమైనవి. ఒకరు అడ్మినిస్ట్రేషన్ రంగంలో మాస్టర్స్, ఇంకొకరు కంప్యూటర్ అప్లికేషన్ల రంగంలో దిట్ట. కావున ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో దేనికి ఓటేయాలో నిర్ణయించుకోవాల్సింది విద్యార్థులే.

డిగ్రీలో ఏ సబ్జెక్టు తీసుకున్న ఎంబీఏ కోర్సులో చేరవచ్చు. అదే ఎంసీఏ కోర్సులో చేరాలంటే ఇంటర్మీడియట్ లో మ్యాథమెటిక్స్ ఒక ప్రత్యేకమైన సబ్జెక్టుగా చదివి ఉండాలి. రెండు కోర్సులలో ఏ కోర్సు చేసిన రాణించగలము అనే నమ్మకం, విద్యార్థులకు ఉన్నవాళ్లు ఆ కోర్స్ ఎంపిక, ఎంపిక చేసుకున్న కాలేజీ, ఉద్యోగం స్వభావం, కంపెనీలు, వివిధ స్కిల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ నైపుణ్యాలు, స్వీయ లక్ష్యం ఆధారంగా దీని వైపు మొగ్గు చూపాలో నిర్ణయించువచ్చు.

ఎంబిఎ యువతను ఆకర్షిస్తున్న క్రేజీ కోర్సులలో ముందుంది. కంపెనీల నిర్వహణకు అవసరమైన మానవ వనరులను అందించడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యం. కార్పొరేట్ రంగంలో కీలక బాధ్యతలు నిర్వహణ చూస్తున్న బిజినెస్ మేనేజర్లు, సీఈవోలు ఎక్కువ మంది ఎంబీఏ కోర్సు చేసిన వాళ్లే. కార్పొరేట్ కెరియర్ సొంతం చేసుకోవాలనుకునే వాళ్ళు ఎంబీఏ కోర్సు చేరడం ఎంతో ఉత్తమం. మేనేజ్మెంట్ రంగంపై ఆసక్తితో పాటు నాయకత్వ లక్షణాలు కలిగిన గ్రాడ్యుయేట్లు ఎంబీఏ కోర్సులో చేరడం మేలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఇంటర్ పర్సనల్ స్కిల్స్, టీం మేనేజ్మెంట్ నైపుణ్యాలు, బిజినెస్ స్కిల్స్ ఉన్న అభ్యర్థులకు ఎంబీఏ చక్కగా సరితూగుతుందని అన్నారు. దీనికి తోడు కమ్యూనికేషన్ స్కిల్స్, బందంగా పనిచేసే నేర్పు, పని నిర్వహణ సామర్థ్యం, ప్రణాళిక [illegible] వ్యవహరించడం, భవిష్యత్తు పరిణామాలను అంచనా వేయగలగడం, బంద పనితీరు మెరుగుపరిచేలా మోటివేషన్ చేయడం, సమన్వయంతో వ్యవహరించడం, సమస్య వచ్చినప్పుడు కారణాలు అన్వేషించడం వంటి నైపుణ్యాలవారు ఎంబీఏ కోర్సును ఎంచుకోవచ్చు అన్నారు.

ఎంసీఏ కోర్సు ఇంజనీరింగ్ కు దీటైన కోర్సుగా పేరుంది. ఇది కంప్యూటర్స్ ఐటీ రంగానికి సంబంధించిన ఉన్నత విద్యా కోర్సు కంప్యూటర్స్ పై ఆసక్తి ఉండి రోజురోజుకు విస్తరిస్తున్న ఐటీ రంగంలో మంచి ఉద్యోగం సంపాదించాలనుకుంటే ఎంసీఏ కోర్సులు ఎంచుకోవచ్చు అని రవికుమార్ వెల్లడించారు. గణిత శాస్త్రం పై పట్టు, ప్రాక్టికల్స్ ఓరియంటేషన్, ప్రాబ్లమ్స్ సాల్వింగ్ నైపుణ్యాలు ఉన్నవారు ఎంసీఏ కోర్సును ఎన్నుకోవడం వలన ఎన్నో మంచి అవకాశాలను సొంతం చేసుకోవచ్చన్నారు. ఎంసీఏ విద్యార్థులకు ప్రధానంగా ఉపాధిని కల్పించే రంగం సాఫ్ట్వేర్ రంగం. ఈ రంగంలో టెక్నాలజీతో పాటు పూర్తి కాలం పని చేయాల్సి ఉంటుంది. కాబట్టి టెక్నాలజీని పరంగా వస్తున్న కొత్త ఆవిష్కరణలు, కంప్యూటర్ లాంగ్వేజెస్ గురించి ఎప్పటికప్పుడు అప్డేట్ సమాచారం అవుతూ కొత్త కోర్సులపై పట్టు సాధించాలని సూచించారు. ఏదైనా విషయాన్ని వేగంగా అవగాహన చేసుకుని నేర్పు విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయగలిగిన పట్టుదల కలిగిన వారే ఎంసీఏ కోర్సులు ఎంచుకోవాలన్నారు. ప్రస్తుతం జాబ్ మార్కెట్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, బంద నిర్వహణ, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, ఇంట్రడక్షన్లు కూడా కీలకంగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు ఆయా అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

ఎంబీఏ కోర్సుతో కొలువులు

మార్కెటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్, రిటైల్ మేనేజ్మెంట్ వంటి విభాగాలలో ఎంబీఏ అభ్యర్థులకు కొలువులు సులభంగా లభిస్తాయి. ముఖ్యంగా ఎంచుకున్న స్పెషలైజేషన్ బట్టి ఉద్యోగాలు ఇక్కడ ఉంటాయి. మేనేజర్లుగా, ప్లానింగ్ ఎగ్జిక్యూటివ్, టీం లీడింగ్ ఇతర విభాగాల్లో సమన్వయం వంటి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. రిటైల్ ఇండస్ట్రీ, కన్సల్టెంట్ సంస్థలు, హోటల్ ఇండస్ట్రీ, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సంస్థలు, మీడియా రంగం, డిజిటల్ మార్కెటింగ్, ఎడ్యుకేషన్ రంగం తదితర రంగాలలో చేరి అవకాశాలు సొంతం చేసుకోవచ్చు.

ఎంసీఏ కోర్స్ తో అవకాశాలు

ఈ కోర్సుతో సాఫ్ట్వేర్ రంగంలో చక్కటి అవకాశాలు దక్కించుకోవచ్చు. ఎంసీఏ పూర్తి చేసుకున్న వారికి ఇటీవల కాలంలో ఐటీ రంగంలో అవకాశాలు మెరుగవుతున్నాయి. వెబ్ డిజైనర్, గ్రాఫిక్ డిజైనర్, సాఫ్ట్వేర్ డెవలపర్, ఐటి అడ్మినిస్ట్రేటర్ వంటి అనేక అంశాల్లో వారిగా అనేక కొలువులు పొందేందుకు అవకాశం ఉంది. నైపుణ్యాలు ఉంటే ఐటీ కంపెనీలు, కన్సల్టెన్సీ సంస్థలు, బహుళ జాతి కంపెనీలు, ప్రైవేటు, ప్రభుత్వ రంగాలు, టెలికాం కంపెనీలు అనేక విధాలుగా అవకాశాలను ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -కార్వేటినగరం: స్థానిక జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ స్వరూప తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఖాళీగా ఉన్న భౌతిక శాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపకులు అవసరం ఉన్నట్లు తెలిపారు. ఎంఎస్సీ, ఫిజిక్స్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 10 తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, జిరాక్స్ కాపీలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని బల్ల పంచాయతీ లక్ష్మీనగర్ యానాది కాలనీకి చెందిన ధనలక్ష్మి, నారాయణపురం తాండకు చెందిన కుప్పుస్వామినాయక్‌లు బుధవారం మృతి చెందారు. వారి మృతదేహాలకు టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిస్వామి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డిలు నివాళులు అర్పించారు. ఆయా కుటుంబ సభ్యులకు రూ.10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నేతలు నాగభుషణం, రాము నాయక్, జయపాల్‌నాయక్, మాదేశ్‌నాయక్, రాఘవనా యక్, దేవేంద్రనాయక్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మోటర్ల ఏర్పాటు

మోటారు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కందూరులో నూతనంగా నిర్మిస్తున్న షాదీ మహల్ త్రాగు నీటి బోరుకు నూతన మోటారు, పైపులు, కేబుల్ అమర్చి నీటి సరఫరా చేసినట్టు సర్పంచి భాషా మసూద్ తెలిపారు. అదేవిధంగా జగనన్న కాలనీలో, కమ్మపల్లెలో రెండు త్రాగునీటి బోర్లలోను నూతన మోటారు కేబులు పైపులు ఏర్పాటు చేసి నీటి సౌకర్యాన్ని కల్పించినట్లు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి సంతాపం

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గిడ్డపల్లిలో వైసిపికి చెందిన సల్లాపురమ్మ బుధవారం మృతి చెందింది. ఆమె మృతి పట్ల ఎమ్మెల్సీ భరత్ సంతాపాన్ని తెలిపారు. ఆయన ఆదేశాలతో వైసిపి నాయకులు ఆమె కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సర్పంచ్ రాజగోపాల్, మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, వైస్ సర్పంచ్ రామలింగారెడ్డి నాయకులు లక్ష్మణ్‌రెడ్డి, సినప్ప ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు.

శ్యామలమ్మ మృతికి మంత్రి నివాళులు

ప్రజాశక్తి-సోమల: సదుం మండలం ఎర్రాతివారిపల్లె ఎంపీటీసీ శ్రీలత తల్లి శ్యామలమ్మ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం పాలమంద దాసిరెడ్డివారిపల్లి గ్రామంలో శ్యామలమ్మ భౌతికకాయాన్ని నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: తిరుపతిలో నిర్వహించిన వేమన పద్యాలపోటీల్లో ప్రతిభ చూపిన వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించారు. తిరుపతిలో నూతనంగా నిర్మించిన వేమన విజ్ఞాన కేంద్రం భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు ఆ పాఠశాల ప్రముఖులు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సుదర్శన్, 7వ తరగతి విద్యార్థి జెమీమా పోటీల్లో గెలుపొందారు. వీరిని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కర్ణాటక మద్యం విక్రేతకు రిమాండ్

ప్రజాశక్తి-చౌడేపల్లి: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ రవిశేఖర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. స్థానిక పంచాయతీ పరిధిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న రాబడిన సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఆదే గ్రామానికి చెందిన శివానందను గుర్తించి అతని నుంచి 120 టెట్రా ప్యాకెట్లు మద్యం, రూ.3788లు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులు హాజరుపరచగా న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించినట్లు వివరించారు.

దుకాణాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-పుంగనూరు: నిబంధనలకు లోబడి బాణాసంచా దుకాణాలు నిర్వహించాలని అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. బుధవారం ఆయన అగ్నిమాపక కార్యాలయంలో బాణాసంచా నిర్వాహకుల లైసెన్స్ మంజూరు, నిర్వహణ తదితర అంశాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాత్కాలిక లైసెన్స్ పొందేందుకు తీసుకోవాల్సిన నిబంధనలు వ్యాపారస్తులకు తప్పనిసరిగా పాటించాలన్నారు. తక్షణమే దుకాణాలు ఏర్పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

డ్రైనేజీ మూతలకు లాక్ సిస్టం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలోని డ్రైనేజీ కాలువలపై ఉన్న మూతలకు లాక్ సిస్టం ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ డాక్టర్ అరుణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఎమ్మెస్ఆర్ సర్కిల్ ప్రాంతంలో మురుగునీటి కాలువలను పరిశీలించారు. కూడలిలో చేపట్టాల్సిన రోడ్డు మరమ్మతులు, సుందరీకరణ పనులపై ఇంజినీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంఇ గోమతి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌తో 60 ఎకరాలకు నీటిపారుదల

ప్రజాశక్తి -తొట్టంబేడు: శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం లోని పొయ్య కురవకలిని గ్రామాలలో 60 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. నీటిపారుదల లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆయా గ్రామాల రైతులు మండల ఎంపీపీ ఉన్నం వాసుదేవ నాయుడు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యలు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మండల ఎంపీపీ గ్రాంటులో నాలుగు లక్షలు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పనులు ప్రారంభించిన రైతులు పేర్లతో సర్వీసులు తీసుకుని చెంబేడు కాలువ నుండి కురవకలిని ట్యాంకుకు లిఫ్ట్ ఇరిగేషన్ కింద 60 ఎకరాల వరకు పొలాలకు సాగునీరు అందిస్తున్న పున్నం వాసుదేవ నాయుడు అన్నారు.

మొక్కు తీర్చుకున్న ఉమేష్ రావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి యాభై రోజుల అనంతరం మధ్యంతర బెయిల్ పై జైలు నుంచి విడుదలైన సందర్భంగా ఆ పార్టీ బీసీ విభాగం నాయకుడు డా.ఎం.ఉమేష్ రావు బుధవారం ముక్కంటి ఎదుట మొక్కు తీర్చుకున్నారు. తలనీలాలు సమర్పించి చంద్రబాబు ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. న్యాయం గెలిచిందని నినదించారు. దశరథరాం, నెమళ్లరు బుజ్జి పాల్గొన్నారు.

స్వీప్ ఆక్టివిటీస్‌ని ముమ్మరం చేయండి

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

- 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయండి
- ఈఆర్‌వోల సమావేశంలో జిల్లా కలెక్టర్ షన్మోహన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు స్వీప్ యాక్టివిటీని ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ సభా వేదిక వద్ద ఓటర్ల సంక్షిప్త సవరణకు సంబంధించి సంబంధించి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ప్రత్యేక అధికారులు, మండల స్థాయి బృందాలతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల సంక్షిప్త సవరణ 2024కి సంబంధించి 2023 అక్టోబర్ 27న ముసాయిదా ఫోటో ఓటర్ల జాబితాను విడుదల అయిందన్నారు. ఇందులో జెండర్, ఈపి రేషియోలపై తహశీల్దార్‌లు వారి మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్‌ల వారిగా దృష్టి సారించాలన్నారు. ఓటర్ల జాబితాలో మణించిన, పెళ్లి అయినన వారు, బదిలీ అయిన ఉద్యోగస్తులు పేర్లు ఇంకా తొలగించపోవడం వల్ల ఈపి రేషియో పెరగడానికి కారణాలు ఉండోచ్చు అన్నారు. వీటిని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. రేషియో తక్కువ ఉన్న చోట ఓటర్లుగా కాని వారు ఉంటారని, అలాంటి వారిని గుర్తించి నమోదు చేయాలని తెలిపారు. ప్రధానంగా 18, 19ఏళ్లు నిండిన విద్యార్థుల కళాశాలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఎన్‌రోల్ చేయాలని సూచించారు. అందుకు సంబంధించి క్లైంల స్వీకరించి బిఎల్‌వోలు వెరిఫికేషన్ చేయాలన్నారు. నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీలలో ఓటర్ల జాబితా సవరణకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ముసాయిదా జాబితాలో తప్పులు, అనర్హులైన ఓటర్ల వివరాలను సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ల దృష్టికి సరిచేయాలన్నారు. డిసెంబర్ 26న ఆక్షేపణలపై విచారణ పూర్తి చేయడం, జనవరి 01న డేటా బేస్‌లో వివరాలను అప్‌లోడ్ చేసి, జనవరి 05న తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా స్థాయిలో జరిగిన వర్క్ షాప్‌లో తెలుసుకున్న విషయాలను డివిజన్ స్థాయిలో, మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు అందరూ కలసి పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఓటర్ల సంక్షిప్త సవరణ 2024 సంబంధించి అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జెసి శ్రీనివాసులు, డిఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పి సిఈఓ ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం ఆర్డిఓలు చిన్నయ్య, సుజన, మనోజ్ కుమార్‌రెడ్డిలు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు కిరణ్మయి, లక్ష్మీ ప్రసన్న, పాల్గొన్నారు.

'సైబర్ జాగ్రూక్త్ దివస్' పేరిట అవగాహన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడానికి 'సైబర్ జాగ్రూక్త్ దివస్' పేరిట అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎస్పి రిషాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మొదటి బుధవారం ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. సైబర్ నేరాల పట్ల జిల్లా పోలీస్ వాట్సప్ నెంబర్ 9440900005కు, సైబర్ మిత్ర 9121211100కు వెంటనే తెలియజేయాలన్నారు.

నగరి: అప్రమత్తతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని సీఐ సురేష్ అన్నారు. బుధవారం స్థానిక సూర్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.

రామకుప్పం: విద్యార్థులు, యువత ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలు, నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రామకుప్పం పోలీసు స్టేషన్ సిబ్బంది సూచించారు. రామకుప్పం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామకుప్పం స్టేషన్ హౌస్ ఆఫీసర్ మురళి, వినోద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రామకుప్పం: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కార్వేటినగరం: విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ దస్తగిరి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు ఎస్.ఐ కళాశాల ప్రిన్సిపాల్ విజియులురెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్.ఐ మునికష్ణ, అధ్యాపకులు డాక్టర్ ధనంజయులురెడ్డి పలువురు.

పుంగనూరు: నేరాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించేందుకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నామని పుంగనూరు సర్కిల్ అర్బన్ సిఐ రాఘవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రామ్మోహన్ రెడ్డి, రైటర్ కేశవరాజు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్ఐ

వెదురుకుప్పం: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సుబ్రమణ్యం అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ కానిస్టబుల్ వేలు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ శారద, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సోమల: సోమల జూనియర్ కళాశాలలో ఎస్ఐ వెంకట నరసింహులు ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు, అధ్యాపక బందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, ఇన్స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఆర్థిక సహకారంతో ప్రకృతి వ్యవసాయంపై పది రోజుల జాతీయ శిక్షణ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతిలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి, ఐసర్, తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ శంతను భట్టాచార్య, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఏవి రమణ, ఎస్ వి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి, అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ హెడ్ డాక్టర్ పి వి సత్య గోపాల్, కోర్సు డైరెక్టర్లు డాక్టర్ జి.కృష్ణారెడ్డి, డాక్టర్ నాగమాధురి హాజరయ్యారు. సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి. రమణ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ తమిళనాడు గుజరాత్ ఉత్తరప్రదేశ్ కర్ణాటక కేరళ జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 37 మంది బోధన విస్తరణ , పరిశోధన సంస్థలలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు పాల్గొన్నారని, పది రోజులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ తమ రాష్ట్రాలలో ప్రకృతి వ్యవసాయం మెలకువలను పాటించాలని సూచించారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య మాట్లాడుతూ వ్యవసాయంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి నిర్దిష్ట వ్యవసాయ పద్ధతులు, సెన్సార్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, క్రిమిసంహారక మందులు లేని వ్యవసాయం ఆచరించడం ద్వారా నాణ్యమైన ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని తెలిపారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ ఏవి రమణ మాట్లాడుతూ వ్యవసాయంలో స్వయం సమృద్ధి సాధించిన ఈ తరుణంలో నేల ఆరోగ్యం, మనుషుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గ చూపాల్సిన అవసరం ఆసన్నమైందని తెలిపారు. ముఖ్యఅతిథి డాక్టర్ శారద జయలక్ష్మి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని రసాయనాల వైపు మళ్లిన వ్యవసాయాన్ని తిరిగి అనాదిగా భారతదేశపు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులైన సమీకృత వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులను తిరిగి ఆచరించాల్సిన అవసరం ఆసన్నమైందని తెలిపారు. రసాయనాలను విచక్షణ రహితంగా వాడటం వల్ల నేలలోని కర్బన శాతం తగ్గడమే కాకుండా నేలలోని జీవ వైవిధ్యం పై కూడా ప్రభావం చూపిస్తుందని, ఆహార భద్రత సమస్య ఉత్పన్నం కాకుండా సమీకృత వ్యవసాయం ఆచరించాలని తెలిపారు. అనంతరం అతిథులందరూ ప్రకృతి వ్యవసాయం శిక్షణపై తయారుచేసిన వివిధ పాఠ్యాంశాల సిడిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 37 మంది శాస్త్రవేత్తలు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

శ్రీరామ కళాశాలలో కబడ్డీ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జేఎన్టీయూఏ అంతర్ కళాశాలల కబడ్డీ ఎంపిక పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెఎన్టియుఏ స్పోర్ట్స్ సెక్రటరీ జాజిరెడ్డి, చిత్తూరు జిల్లా డిఎస్డివో బాలాజీ ఆధ్వర్యంలో ఈ కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పోటీలలో విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జీవిత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇటువంటి అంతర్ కళాశాలల మధ్య జరిగే క్రీడలు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయని కళాశాల అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె. జయచంద్ర, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ప్రొటెక్టివ్ సెక్యూరిటీ సర్వీసు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఉపాధి కల్పనలో ప్రొటెక్టివ్ సెక్యూరిటీ సర్వీసు ద్వారా నిరుపేదలకు ఉద్యోగాలు అందిస్తూ, వారి జీవితాలను మెరుగుపరుస్తోందని సంస్థ అధినేత కల్లూరు చలపతి తెలిపారు. స్థానిక పెద్దకాపువీధి లేవుట్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తిరుపతిలో ఈ సంస్థను నిర్వహిస్తూ, ప్రారంభించిన అనతి కాలంలోనే అంచెలంచెలుగా ఎదిగి, ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఎందరికో ఉపాధి కల్పించామన్నారు. తిరుపతి సమీపంలోని ప్రముఖ సినీనటుడు మంచు మోహన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యానికేతన్ విద్యాసంస్థలకు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు కుటుంబం నిర్వహిస్తున్న హెరిటేజ్ పాలకేంద్రానికి, దొడ్ల డైరీ పాల డిపోతో పాటు అనేక విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలకు, వివిధ బ్యాంకులకు చెందిన ఏటిఎం కేంద్రాలకు తమ సంస్థ ద్వారా భద్రత, హౌస్‌కీపింగ్ సిబ్బందిని అందిస్తున్నామన్నారు. వీటితో పాటు ఎవ్వరైనా వారి సొంత ఇంటికి సైతం భద్రత సిబ్బంది అవసరమైతే అందిస్తున్నామని తెలిపారు. క్రమశిక్షణతో కల్గిన సిబ్బందితో, స్త్రీ, పురుషులకు సైతం ఉపాధి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో సైతం తమ సేవలు అందిస్తూ అందరి మన్ననలను పొందామని తెలిపారు. తమ సంస్థలో చేరిన వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, సిబ్బంది శారీరక దారుఢ్యం, క్రమశిక్షణా, ఆరోగ్యం, వృత్తిలో నైపుణ్యం సాధించేందుకు తగిన శిక్షణ అవసరమన్నారు. మిలిటరీలో చేరి రిటైరు అయిన వారి వద్ద నుంచి తమ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తమ సంస్థ ద్వారా పెద్ద పెద్ద నాయకులకు, అధికారులకు, విఐపిలకు, పర్సనల్ సెక్యూరిటీ గార్డులను, పెద్ద పెద్ద ఫంక్షన్లకు వచ్చే సెలబ్రిటీలకు, వివాహాది శుభాకార్యాలకు, సెక్యూరిటీ గార్డులను అందించి సేవలందిస్తున్నట్లు తెలిపారు. శ్రీవారి పాదాల చెంత సంస్థను స్థాపించి, ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ, భద్రతకు మారు పేరుగా నిలిచామన్నారు. వివరాలకు 8374099799 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

K. Chalapathi
Proprietor

'మాన్యవర్'కు అంబాసిడర్‌గా రామ్ చరణ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

భారతదేశంలో పురుషుల ఫ్యాషన్ సెలబ్రేషన్ వేర్ బ్రాండ్ అనగానే అందరికి గుర్తుకువచ్చే అగ్రగామి బ్రాండ్ మాన్యవర్. అలాంటి ఈ బ్రాండ్ ఇప్పుడు తమ బ్రాండ్ అంబాసిడర్ గా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ను ప్రకటించింది. ఇది పెళ్లిళ్లు, పండుగల సీజన్. ఈ సీజన్ లో తమ ఉత్పత్తులను మరింత మందికి చేరవేసేందుకు టైయారహోకారైయే అనే కొత్త క్యాంపెయిన్ ను మాన్యావర్ మొదలుపెట్టింది. ఈ సందర్భంగా వేదాంత్ ఫ్యాషన్స్ లిమిటెడ్ చీఫ్ రెవిన్యూ ఆఫీసర్ వేదాంత్ మోడీ మాట్లాడుతూ... "రామ్ చరణ్‌ను మాన్యావర్ కుటుంబానికి స్వాగతించడం మాకు గౌరవంగా ఉంది. భారతదేశ ప్రేక్షకుల్లో ఆయనకున్న క్రేజ్, చరిష్మా, ఆకర్షణ, గ్లోబల్ అప్పీల్ మాన్యావర్ డ్రెస్సింగ్ దష్టితో సంపూర్ణంగా సరిపోతాయి' అన్నారు. వేదాంత్ ఫ్యాషన్స్ మోహే ద్వారా మహిళలకు వివాహ, లెంగ్త్ దుస్తులను కూడా అందిస్తోంది. మొత్తం కుటుంబానికి కావాల్సిన దుస్తుల్ని అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ 22వ వార్డు ఆరేటమ్మ కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆ వార్డ్ కౌన్సిలర్, టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి, తల్లికి వందనం, పూర్‌టు రిచ్, యువగళం, అన్నదాత, బీసీలకు రక్షణచట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ స్కీముల ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలతో ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, చిత్తూరు పార్లమెంటు టీఎన్‌టియుసి అధ్యక్షులు, 20వ యూనిట్ ఇన్‌చార్జ్ ఆర్.మాధవ నాయుడు, చిత్తూరు పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగరెడ్డి, పుత్తూరు పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్. ఎన్. ధనపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ బి.ఆర్.యుగంధర్, మాజీ వైస్ చైర్మన్లు డిఎస్‌గణేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ, సంఘమిత్రల అవినీతిపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - వెంకటగిరి: ఉపాధి హామీలో, డక్కిలి మండల సమైక్య సంఘమిత్ర కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విజిలెన్సు విచారణ జరిపించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల అభివృద్ధి అధికారికి బుధవారం వినతి పత్రం అందించారు. ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య మాట్లాడుతూ మండలంలో 27 పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో స్థానిక గ్రామస్థాయి సిబ్బంది మండల స్థాయి సిబ్బంది మమేకమై ఉపాధి హామీలో నిధులను అక్రమ మార్గంలో అవినీతికి పాల్పడుతున్నారని సామాజిక తనిఖీ బృందాలు కూడా అవినీతికి పాల్పడుతున్న సిబ్బందితో కలిసి ప్రభుత్వ నిధులకు గండి కొడుతున్నారన్నారు. ఏపీ అరుణోదయ సంస్కృతి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు దండోవోలో కిష్టయ్య మాట్లాడుతూ దక్కిలి మండల సమైక్య సంఘమిత్ర కార్యాలయంలో మహిళ పొదుపు గ్రూపులలో రైతు మిత్ర గ్రూపులలో యానాది సమైక్యలలో లక్షలాది రూపాయలు అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా సమాచార హక్కు చట్టం2005 ప్రకారం 2021 నుండి 2023 వరకు జరిగిన ఆర్థిక వివరాలు కూడా ఇవ్వాలని తెలియజేశారు లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక మండల ప్రధాన కార్యదర్శి ముత్యం, గిరిజన సంఘం నాయకులు పి ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆదరించండి

ప్రజాశక్తి-శాంతిపురం: జగనన్న ప్రభుత్వాన్ని ఆదరిస్తే అందరికీ మంచి జరుగుతుందని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ అన్నారు. బుధవారం మండలంలోని మఠం పంచాయతీ కేపీమిట్టలో 'జగనన్నతో జనం భరత్ అన్నతో మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు సంబంధిత అంశాలను అడిగి తెలుసుకున్నారు. బడుగు బలహీన వర్గాలను ఆదుకోవడమే జగనన్న లక్ష్యం అన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసిపిని గెలిపించి మళ్లీ జగనన్నను సిఎం చేస్తే మరిన్ని సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి శ్రీనివాసులు, వడ్డెర సంఘం స్టేట్ డైరెక్టర్ పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పల్లవికి ఆత్మీయ వీడ్కోలు

డాక్టర్ పల్లవిని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: ఎస్ఆర్‌పురం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పల్లవికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. బుధవారం ఆమెకు దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కోవిడ్ సమయంలో పద్మాపురం గ్రామంలో పెళ్లి భోజనాల్లో ఫుడ్ పాయిజన్ అయిన సమయంలో ఆమె చేసిన సేవలను హర్షించదగ్గవని కొనియాడారు. రెండు సార్లు జిల్లా కలెక్టర్, చిత్తూరు ఎమ్మెల్యే చేతుల మీదుగా బెస్ట్ అవార్డు తీసుకున్నారని ఆమె సేవలను గొప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పురం డాక్టర్ సందీప్ రాజ్, ఎంపీడీవో కృష్ణయ్య, జెడ్పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ హరితకుప్పయ్య, నాయకులు జనార్దన్, మణి, మహేష్ కుమార్ గౌడ్, హరిరెడ్డి, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

'వైఎస్సార్ కంటి వెలుగు'తో ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి-బంగారుపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం పేద ప్రజలకు ఎంతో ఉపయోగం అని తుంబ కుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయులు అన్నారు. బుధవారం మండలంలోని గుంతూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్రాక్షాయని, ఎంపిటిసి గోమతి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికే చెకుముకి

ప్రజాశక్తి-పుంగనూరు: సైన్సు పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు దోహద పడతాయని జనవిజ్ఞాన వేదిక పుంగనూరు అధ్యక్షురాలు సుశీలమ్మ అన్నారు. స్థానిక కేజీబీవీలో జెవివి ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సంబరాలు గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జెవివి నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణం, సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. సైన్సును నిత్య జీవితానికి అన్వయించుకోవడం నేర్చుకోవాలన్నారు. చెకుముకి సైన్సు సంబరాలు నాలుగు స్థాయిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయి నవంబర్ 10న, 30న మండల/పట్టణ స్థాయి, జిల్లా స్థాయిలో డిసెంబర్17, రాష్ట్ర స్థాయిలో 2024 జనవరి27, 28 తేదీలలో జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ వసియా ఫర్హాత్ ఉపాధ్యాయురాలు రేణుక, రేవతి, నౌజియా, జెవివి సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం విమర్శించడం బాధాకరం

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: డిప్యూటి సిఎంని కొంతమంది నాయకులు విమర్శిస్తుండడం బాధాకరమని వైసిపి నాయకులు, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి అన్నారు. నారాయణస్వామి ఆవేశపరుడే కాని అవినీతి పరుడు కాదని పేర్కొన్నారు. బుధవారం ఎంపిపి చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి డిప్యూటి సిఎం అన్ని విధాల కృషి చేశారని, ప్రత గడపలోని సమస్యను పరిష్కరించాడన్నారు. అంతేకాకుండా శిధిల అవస్థలో ఉన్న ఆలయాలను గుర్తించి ప్రత్యేక చొరవతో రూ.వందల కోట్లు తీసుకువచ్చారన్నారు. టీటీడీ అనుసంధానంతో ఒక్కొక్క గుడికి రూ.10 లక్షల వ్యయంతో నియోజకవర్గంలోని 150 గుడి నిర్మాణాలకు మంజూరు చేయించారన్నారు. వైసిపి పార్టీలోని కొంత మంది నాయకులు రెడ్డి సామాజిక వర్గాన్ని తిడుతున్నారన్న ప్రచారాన్ని తప్పు పట్టారు, కుల మతాలకు అతీతంగా అభివృద్ధి చేసి చూపిస్తుంటే అలాంటి నాయకుడు పై తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నమ్మరెడ్డి, మండల ఆర్.బి.కె అడ్వైజరి కమిటీ చైర్మన్ బలరామిరెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విజేతగా చౌడేపల్లి జట్టు

ప్రజాశక్తి-చౌడేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన జోనల్ గేమ్స్‌లో భాగంగా కబడ్డీ పోటీల్లో చౌడేపల్లి విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన పోటీల్లో సీనియర్ బాలికల విభాగంలో చౌడేపల్లి ఉన్నత పాఠశాల బాలికలు విజేతలుగా నిలిచారు. పుధిపట్ల సీనియర్ బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. అదే విధంగా జూనియర్ బాలుర విభాగంలో సదుం ఎంజెపి మొదటి స్థానం సదుం ఉన్నత పాఠశాల బాలురు రెండవ స్థానంలో నిలిచారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో క్రీడల ప్రాధాన్యతకు గురించి ఎంపీపీ గాజులరామ్మూర్తి విద్యార్థులకు వివరించారు. అనంతరం క్రీడా పోషకుడు రాష్ట్ర యువకాకునాడు అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌ను పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు స్థానికులు ఘనంగా సన్మానించారు ప్రధానోపాధ్యాయుడు నాగరాజురెడ్డి, ఎంపిటీసీలు రూపారేఖ, శ్రీరాములు తెల్లారి ఏజెన్సీస్ జీవన్ ప్రకాష్ లీలా కుమార్‌నాయక్, పీడీలు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేతలుగా సోమల జట్టు

కప్పును కైవసం చేసుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థుల జట్టు బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచారని పిడి కరుణానిధి తెలిపారు. పుంగనూరు స్థాయి జోనల్ పోటీలు రొంపిచర్ల మండలం పెద్దమల్లెల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఫైనల్స్‌లో పెద్దపంజాని మండలం నేలపల్లి ఉన్నత పాఠశాల జట్టుతో తలబడ్డ తమ పాఠశాల జట్టు ఉత్తమ ప్రతిభతో గెలుపొందిందన్నారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. విజయం సాధించి కప్పు సాధించిన విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

వైయస్ జగన్మోహన్ రెడ్డితోనే అభివృద్ధి: వైసిపి

ప్రజాశక్తి -ఏర్పేడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే బడుగుల బాగు అని సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య పేర్కొన్నారు. ఏర్పేడులో వేకువజామునే ప్రతి గడపకు వెళ్లి నల్ల పాలెం శివయ్య చేతుల మీదుగా పెన్షన్ అందిస్తూ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని, కృషి గురించి లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా శివయ్యకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. శివయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో తామంతా గ్రామ పంచాయతీల అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు శివయ్య తెలిపారు.

ఏర్పేడులో బూత్ లెవెల్ ఆఫీసర్స్ సమావేశం

ప్రజాశక్తి -ఏర్పేడు: మండల కేంద్రమైన ఏర్పేడులో ప్రగతి భవనంలో శ్రీకాళహస్తి రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రవిశంకర్ రెడ్డి ఓటర్ జాబితాను ఉద్దేశించి బూత్ లెవెల్ ఆఫీసర్స్ తో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏర్పేడు మండల తహశీల్దార్, సుద్దాల శివ ప్రసాద్, బిఎల్‌ఓ ఆఫీసర్స్ పాల్గొన్నారు.